నమ్మకం లేదన్నమాటేగా?"

"అది... అది..." నసిగిందామె.

"సారీ మేడమ్! నన్ను ప్రేమించని వారినైనా నేను మనస్ఫూర్తిగా ప్రేమించగలను గానీ నా మీద నమ్మకం లేని వారితో మాత్రం జీవితాన్ని పంచుకోలేను. ఆర్నెల్లుగా మనకు పరిచయమున్నా నా మాట మీద నీకు నమ్మకం లేకపోయిందంటే- ఇటీజ్ ఎ పిటీ! గుడ్ బై" అనేసి గబగబగా నడిచి వెళ్లిపోతున్న అతని వంక ప్రాన్పడిపోయి చూస్తూ వుండిపోయింది రజని.

**-తిరుమలశ్రీ** (జంషెడ్పూర్)

# నైజం



**ఆ**ఫీసులు, స్కూళ్లు, కాలేజీలు వదిలే వేళ. వాహనాలతో రోడ్లన్నీ విపరీతంగా రద్దీగా వున్నాయి. ఎడతెరిపి లేనంతగా కిక్కిరిసి వున్నాయి. ఓ స్టాపులో ఆగిన బస్సు పూర్ణగర్భిణీలా వుంది. అయినా పుష్పక విమానంలా జనాల్ని ఎక్కించుకుని బయల్దేరడానికి సిద్ధంగా వుంది.

ఇంతలో ఆదరాబాదరాగా బస్సులోకి దూసుకొచ్చిందో మహిళ. చదువూ- సంస్కారం కలిగివున్నట్లే వుంది ఆమె వాలకం. చేతిలో బస్తా అంత బరువున్న హేండుబేగు, చెమటతో తడిసిన శరీరం, అలసటతో ఉసూరుమన్న ముఖం, చెదిరిన కుంకుమ తిలకం, బడలికతో వాలిపోయిన కళ్లతో, చెప్పకనే చెపుతున్నదా వాలకం ఆమె ఉదయం నుండి పనిచేసి అలసిపోయిందని.

బస్‌లో అడుగుపెడుతూనే "అబ్బ!" అంటూ నిట్టూర్చింది.

అటు, యిటు చూసిందామె సీటుకోసం. జనంతో బస్ కిటకిటలాడుతోంది. నిల్చునే ఓపిక లేక అసహనంగా కదిలింది అటు, యిటు.

"ఈ సిటీ బస్ ఎప్పుడూ యింతే! డబ్బులిచ్చి కూడా ఉసూరుమంటూ నిల్చోవల్సిందే!" స్వగతంలో పలికినట్టున్నా ఆ మాటలు ఆమె నిస్త్రాణాన్నీ, నీరసాన్నీ తెలియజేస్తున్నాయి.

కుడిభుజం మీద బరువు ఎడం భుజానికి మార్చుకుని, పమిటతో ముఖం తుడుచుకుని, పైట చెంగు బొడ్డులో దోపుకుని మరోసారి చూసింది ముందూ, వెనకా.

కండక్టరు వెనుక సీట్లో కూర్చున్న ఓ పెద్దమనిషి ఈమె పరిస్థితి చూసి వెంటనే లేచి నించుని-

"కూర్చోండి మేడమ్" అన్నాడు అతని సీటు ఆఫర్ చేస్తూ. పక్కనే మరో ఆసామీ వుండడం వల్ల

"ఇట్సాల్‌రైట్!" అంటూ ఆయన ఖాళీ చేసిన సీటులో ఆ ఆసామి పక్కనే కూర్చుంది. మళ్లీ ముఖం తుడుచుకుంది. ప్రక్కన కూర్చున్న మరో అతను కాస్త యిబ్బందిగా కదిలి లేవబోయాడు.

"మీరు కూర్చోండి. నాకేం యిబ్బంది లేదు. విదేశాల్లో వారి నాగరికతని మనతో పోలిస్తే, మనం చాలా వెనకబడివున్నాం. అందరం ఒకే కుటుంబంలా మెలగాలి, సోదరభావంతో వుండాలి. ఆడ, మగ అంటూ గిరిగీసుక్కూచో కూడదు. అది నాగరికత అనిపించుకోదు. మనసు నిర్మలంగా వుండాలి కాని మనషులెవరైతేనేం? ఆపదలో అవసరంలో సహాయపడ్డమే మానవత్వం! ఆ నైజం అందరూ అలవరచుకోవాలి" అందామె. ఆమెకు మనుషులపట్ల గల ఉన్నత భావాలు, ఆమె సంస్కారానికి ఎంతో మురిసిపోయేడు ఆ ప్రక్కన కూర్చున్న వ్యక్తి. కాసేపటికి దిగిపోయేడు.

"రైట్! రైట్" కండక్టరు కేకకి కదలబోయింది బస్సు.

"ఆపండాపండి!" అంటూ హడావుడిగా బస్‌లోకి జొరబడ్డాడు ఓ మనిషి. బాగా ఆయాస పడుతున్నాడు. ఆమె పక్కన ఖాళీగా వున్న సీట్లో కూలబడ్డాడు. అతను నిలబడే స్థితిలో లేడు. బాగా జ్వరంగా వుండడం వల్ల తూలుతున్నాడు. గత్యంతరం లేక ఆమె ప్రక్కనే కూలబడి ఒదిగి కూర్చున్నాడు. ఛివాల్న చూసిందామె అతనివైపు.

"ఏంటయ్యా! ఆడామగా తేడా తెలీడం లేదా? మర్యాదకైనా ఓ ముక్క అడక్కుండా గభాల్న అలా కూలబడ్డమేనా? సభ్యతా, సంస్కారం వుండక్కర్లా?" ఆమె చూపులు వాడిగా, ఆమె పలుకులు వేడిగా వున్నాయి.

"క్షమించు తల్లీ! నీ తండ్రిలాంటి వాడిని, నుంచోడానికి ఓపిక లేదు, జ్వరంగా వుంది తల్లీ!"

"అంతలా నుంచో లేకపోతే ఏ ఆటోనో, టాక్సీనో ఎక్కాల్సింది. ఈ సిటీ బస్సే ఎక్కాలా? ఈ బస్సులెప్పుడూ రద్దీగానే వుంటాయ్!" మనుషుల పట్ల, వారి పరిస్థితి పట్ల అవహేళన ఆమె మాటల్లో ధ్వనించింది.

"ఆటోలూ, టాక్సీలు ఎక్కే స్తోమత అందరికీ వుంటదా తల్లీ? ఎంత! ఓ పది నిముషాల్లో దిగిపోతాలే తల్లీ. అందాక కాస్త ఓర్చుకోమ్మా!"

"సర్దుకోక చస్తానా? దిగక ఎవరం వుండిపోతాం బస్సులో. కూర్చున్నప్పుడే వుండాలి ఇంగితం" ఆమె మాటలో ఈసడింపు.

బస్సు కాస్త ఖాళీ అవడంతో ఆ పక్కసీట్లోనే కూర్చొని లెక్క చూసుకుంటున్నాడు కండక్టర్. ఈ తతంగం అంతా వింటున్నాడు. ఇందాకా ఆవిడ మాటలకీ, ఇప్పుడు అదే మనిషి ప్రదర్శించిన సంస్కారం, మనుషుల పట్ల ఏవగింపునకు అర్థం?

ఆమె 'అవకాశవాదానికి' చిన్నగా నవ్వుకున్నాడు. బస్సు ముందుకు సాగిపోతోంది.

**-పూడిపెద్ది నీలవేణి**

(శృంగవరపుకోట)